నేటి నుంచి రెండు రోజుల పాటు సదస్సు

వ్యవసాయ యూనివర్సిటీ, సెప్టెంబర్ 18 : ప్లాంట్ ప్రొటెక్షన్ ఆఫ్ ఇండియా(పీపీఓఐ) ఆధ్వర్యంలో రెండు రోజులపాటు అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు అధ్యక్ష, కార్యదర్శులు శరత్‌బాబు, డాక్టర్ జగదీశ్వర్ తెలిపారు. రాజేంద్రనగర్ ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం ఆడిటోరియంలో గురు, శుక్రవారాల్లో రెండురోజుల పాటు సదస్సు నిర్వహించనున్నారు. ప్రదానంగా బ్రెయిన్ స్టోర్మింగ్, సేంద్రీయ ఎరువులు, బయోకెమికల్స్, ఫార్మింగ్, విత్తన పరిశోధన, పరిశీలన, పురుగుమందుల యాజమాన్యం తదితర అంశాలపై సీనియర్ శాస్త్రవేత్తలు పాల్గొని చర్చించనున్నట్లు పేర్కొన్నారు.

రేడియోలాజికల్ ఫిజిక్స్ ఫలితాలు విడుదల

ఉస్మానియా యూనివర్సిటీ, సెప్టెంబర్ 18: ఓయూ పరిధిలోని పీజీ డిప్లొమా ఇన్ రేడియోలాజికల్ ఫిజిక్స్ పరీక్షా ఫలితాలను విడుదల చేసినట్లు ఎగ్జామినేషన్స్ కంట్రోలర్ ప్రొఫెసర్ రాములు తెలిపారు. సెమిస్టర్ రెగ్యులర్, బ్యాక్‌లాగ్ పరీక్ష ఫలితాలను విడుదల చేసినట్లు చెప్పారు.

లంబాడాల ఐక్యవేదిక గ్రేటర్ కార్యదర్శిగా శ్రీనూనాయక్



ఖైరతాబాద్, సెప్టెంబర్ 18 : లంబాడాల ఐక్య వేదిక (లైవ్) గ్రేటర్ కార్యదర్శిగా నగరానికి చెందిన వడ్త్యావత్ శ్రీనూనాయక్ ఎన్నికయ్యారు. ఈ మేరకు రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ రాజ్‌కుమార్ జాదవ్, చీఫ్ కోఆర్డినేటర్ జాదవ్ రమేశ్‌నాయక్‌కు నియామకపత్రం అందజేశారు. పార్టీలకతీతంగా బంజారాలు, లంబాడాల అభివృద్ధికి కృషి చేస్తానని శ్రీనూనాయక్ తెలిపారు.

చాకలి ఐలమ్మ వారసులను ఆదుకోవాలి

- సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు డీజీ నరసింహారావు

ఖైరతాబాద్, సెప్టెంబర్ 18 : వీరనారి చాకలి ఐలమ్మ వారసులు, కుటుంబసభ్యులను ప్రభుత్వం ఆదుకోవాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు డీజీ నరసింహారావు కోరారు. తెలంగాణ తల్లి ఐలమ్మ ఫౌండేషన్ ఆవిర్భావ సభ బుధవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో జరిగింది. ముఖ్యఅతిథిగా హాజరైన నరసింహారావు, ఐలమ్మ వారసురాలు చిట్యాల మంజులతో కలిసి మాట్లాడారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో ఐలమ్మ ధీరత్వం వెలకట్టలేనిదన్నారు. తెలంగాణ మహిళా శక్తికి ధైర్యసాహసాలకు ప్రతీకగా నిలిచిన ఐలమ్మను తెలంగాణ తల్లిగా గుర్తించాలన్నారు. జనగామ జిల్లాకు ఆమె పేరు పెట్టాలని, ట్యాంక్‌బండ్‌పై ఐలమ్మ విగ్రహాన్ని ప్రతిష్టించాలని, హైదరాబాద్‌లో స్మారక భవనాన్ని నిర్మించాలని డిమాండ్ చేశారు. ఐలమ్మ చరిత్రను పాఠ్యపుస్తకాల్లో చేర్చాలన్నారు.

ఐలమ్మ వారసులు, కుటుంబసభ్యులను ఆర్థికంగా ఆదుకోవాలన్నారు. ఆమె కుటుంబంలో వృత్తిని నమ్ముకున్న వారికి ఉపాధి అవకాశాలు, విద్యావంతులకు ఉద్యోగ అవకాశాలను కల్పించాలని కోరారు. అనంతరం ఫౌండేషన్ నూతన కమిటీని ప్రకటించారు. అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా చిట్యాల యాకయ్య, చిట్యాల మంజుల, ఉపాధ్యక్షులుగా జంపయ్య, కొమురయ్య, భాగ్య, సంధ్యారాణి, కృష్ణ, సంయుక్త కార్యదర్శులుగా భవాని, రమేశ్, కోశాధికారిగా రాజును ఎన్నుకున్నారు. సమావేశంలో సీపీఐ ఎంఎల్ రాష్ట్ర నేతలు రమ, సైదయ్య, ఎంసీపీఐయూ నేత రవి తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ తల్లి ఐలమ్మ ఫౌండేషన్ బ్రోచర్లను ఆవిష్కరిస్తున్న సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు డీజీ నరసింహారావు, ఐలమ్మ వారసులు

చేనేత వస్త్రాలను ప్రోత్సహించాలి

- మల్లారెడ్డి విశ్వవిద్యాలయ వైస్ చైర్మన్ డాక్టర్ సీహెచ్ ప్రీతిరెడ్డి
- సత్యసాయి నిగమాగమంలో లైవ్ హ్యాండ్లూమ్ సిల్క్ ఎక్స్‌పో

వెంగళరావునగర్, సెప్టెంబర్ 18 : శ్రీనగర్ కాలనీలోని సత్యసాయి నిగమాగమంలో ఏర్పాటు చేసిన లైవ్ హ్యాండ్లూమ్ సిల్క్ ఎక్స్‌పో- చేనేత పట్టు వస్త్ర ప్రదర్శనను బుధవారం మల్లారెడ్డి విశ్వవిద్యాలయ వైస్ చైర్మన్ డాక్టర్ సీహెచ్ ప్రీతి రెడ్డి, సోషలిస్ట్ సుధాజైన్, లైవ్ హ్యాండ్లూమ్ సిల్క్ ఎక్స్‌పో వ్యవస్థాపకురాలు శైలజా యముసామితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె చేనేత వస్త్రోత్పత్తులను తిలకిస్తూ, వాటి తయారీ విధానం, ప్రత్యేకతను కళాకారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ప్రీతిరెడ్డి మాట్లాడుతూ.. ఎగ్జిబిషన్‌లు ఎల్లప్పుడూ మహిళలకు ఉత్సాహాన్ని కలిగిస్తాయన్నారు. ప్రతి స్టాల్ ప్రత్యేకంగా ఉందని వివిధ రాష్ట్రాల సంస్కృతిని ప్రతిబింబిస్తున్నాయని అన్నారు. లైవ్ హ్యాండ్లూమ్ సిల్క్ ఎక్స్‌పో వ్యవస్థాపకురాలు శైలజాయముసామి మాట్లాడుతూ.. దేశ వ్యాప్తంగా 60 మంది చేనేత ఎగ్జిబిటర్లు తమ చేనేత ఉత్పత్తులను ప్రదర్శిస్తున్నట్లు తెలిపారు. ఈ ప్రదర్శన ఈనెల 26 వరకు కొనసాగుతుందన్నారు.

చీరలను పరిశీలిస్తున్న మల్లారెడ్డి విశ్వవిద్యాలయ వైస్ చైర్మన్ డాక్టర్ సీహెచ్ ప్రీతిరెడ్డి

పరిసరాల పరిశుభ్రతతోనే సంపూర్ణ ఆరోగ్యం

- శంషాబాద్ మున్సిపల్ కమిషనర్ సుమన్‌రావు
- పలుచోట్ల 'స్వచ్ఛతా హీ సేవ' కార్యక్రమం

శంషాబాద్ రూరల్, సెప్టెంబర్ 18 : పరిసరాల పరిశుభ్రతతోనే సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని శంషాబాద్ మున్సిపల్ కమిషనర్ సుమన్‌రావు తెలిపారు. బుధవారం శంషాబాద్ పట్టణంలోని 'స్వచ్ఛతా హీ సేవ' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ మాట్లాడుతూ.. పరిసరాల పరిశుభ్రతతోనే ప్రజలు ఆరోగ్యంగా ఉంటారని అన్నారు. ప్రతి ఒక్కరూ రోజూ తమ ఇంటి పరిసరాలను పరిశుభ్రం చేసుకోవడం ద్వారా ఆహ్లాదకరం వాతావరణం ఏర్పడుతుందన్నారు. ఈ సందర్భంగా స్వచ్ఛ మిషన్ సందేశాన్ని చదివి వినిపించారు. అనంతనం విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ లక్ష్మయ్య, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బండ్లగూడ పరిధిలో...

బండ్లగూడ : బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో బుధవారం స్వచ్ఛతా హీ సేవ-2024 కార్యక్రమాలను చేపట్టారు. చెరువుల వద్ద శుభ్రత, సింగల్‌యూజ్ ప్లాస్టిక్‌పై, జీవీ పాయింట్ క్లీనింగ్ వంటి వాటిపై ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ శరత్‌చంద్ర, శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ నరేశ్, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న కమిషన్ సుమన్‌రావు, తదితరులు

బండ్లగూడలో చెత్తనుతొలగిస్తున్న పారిశుధ్య సిబ్బంది, పరిశీలిస్తున్న బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కమిషనర్ శరత్‌చంద్ర

అక్కినేని జీవితం స్ఫూర్తి దాయకం

రామకృష్ణ,కన్నారావును సత్కరిస్తున్న ప్రముఖులు

హిమాయత్‌నగర్,సెప్టెంబర్18: క్రమశిక్షణ, ఆత్మ విశ్వాసం, సామాజిక సేవ, కష్టపడే స్వభావానికి అక్కినేని మారుపేరని సినీ దర్శకులు రేలంగి నరసింహారావు, ప్రముఖ సాహితీవేత్త డాక్టర్ వోలేటి పార్వతీశం అన్నారు. పద్మ విభూషణ్, నట సామ్రాట్ డాక్టర్ అక్కినేని నాగేశ్వరరావు శత జయంతి మహోత్సవం సందర్భంగా బుధవారం రాత్రి హిమాయత్‌నగర్‌లోని అలైడ్ ఆర్టిస్ట్స్ ఆడిటోరియంలో అక్కినేని సంగీత మహోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తెలుగు సంస్కృతి, సాంప్రదాయాలను పాటిస్తూ తెలుగు చిత్ర పరిశ్రమ అభివృద్ధికి అక్కినేని ఎంతో కృషి చేశారని అన్నారు. అనంతరం ప్రముఖ గాయకులు వైఎస్.రామకృష్ణ, డాక్టర్ అమలాపురం కన్నారావుకు డాక్టర్ అక్కినేని ఆత్మీయ పురస్కారం అందజేసి ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో కిన్నెర ఆర్ట్ థియేటర్స్ అధ్యక్షుడు డాక్టర్ ఆర్. ప్రభాకర్‌రావు, కార్యదర్శి మద్దాళి రఘురామ్, డాక్టర్ వంశీ రామరాజు తదితరులు పాల్గొన్నారు.

'షేక్స్పీయర్ పేరును ఆ దేశాలు మార్చాయి..'

ఖైరతాబాద్, సెప్టెంబర్ 18 : ప్రఖ్యాత రచయిత విలియమ్ షేక్స్పీయర్ పేరును కొన్ని ఇస్లామిక్ దేశాలు అర్థాన్ని మార్చి తమ ప్రచురణలకు వినియోగించుకుంటున్నాయని రచయిత, జర్నలిస్టు డాక్టర్ ఎస్.వేణుగోపాల్ అన్నారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో బుధవారం ఆయన మాట్లాడుతూ కొన్ని ఇస్లామిక్ దేశంలో షేక్స్పీయర్ పేరును షేక్, పియర్‌గా మార్చి పుస్తకాలు ప్రచురిస్తున్నాయన్నారు. దీనిని అడ్డుకోవాలని ఆయన పేర్కొన్నారు.

సమస్యల సాధనకు కార్మికులు ఐక్యంగా పోరాడాలి

మైలార్‌దేవ్‌పల్లి, సెప్టెంబర్ 18: సమస్యల పరిష్కారానికి కార్మికులంతా ఐక్యంగా పోరాడాలని సీఐటీయూ రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షుడు జాజాల రుద్రకుమార్ పిలుపునిచ్చారు. సీఐటీయూ కాటేదాన్ క్లస్టర్ కమిటీ ఆధ్వర్యంలో బుధవారం కార్మికుల సమస్యలు పరిష్కరించాలని రిలే నిరాహార దీక్ష నిర్వహించారు. దీక్షలను రుద్రకుమార్ ప్రారంభించి మాట్లాడారు. కాటేదాన్ పారిశ్రామిక ప్రాంతంలో బిస్కెట్, ఆయిల్, కుర్‌కురే, మసాలా, పాపడ్, ప్లాస్టిక్ కవర్స్, మిర్చి, పసుపు, ఐరన్, డ్రమ్స్, కలర్స్, చాక్లెట్స్ తదితర అనేక పరిశ్రమలు ఉన్నాయన్నారు. ఈ పరిశ్రమల్లో వలస కార్మిక చట్టం అమలు చేయడంలేదని, కార్మికులకు కనీస వేతనాలు, జీతాలు అందించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కార్మికులకు కనీస వేతనం రూ. 26 వేలు, ఈఎస్ఐ, పీఎఫ్, ఉద్యోగ భద్రత, ఐడెంటిటీ కార్డ్స్, వసతి కల్పించాలన్నారు. ఈనెల 30న హక్కుల సాధన కోసం జరిగే కార్మిక భవన ముట్టడి, ధర్నాలో కాటేదాన్ పారిశ్రామిక ప్రాంతంలోని కార్మికులంతా పాల్గొనాలని కోరారు. సాయంత్రం వరకు రిలే నిరాహార దీక్షలు కొనసాగాయి. దీక్షల్లో నాయకులు బి.బాలరాజు, గోపాల్, రంగయ్య, వెంకటేశ్, రాములు, రాజు, సత్యనారాయణ, సత్తార్, జావెద్, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

కాటేదాన్‌లో కార్మికుల రిలే దీక్షలను ప్రారంభిస్తున్న సీఐటీయూ రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షుడు జాజాల రుద్రకుమార్

ఎర్రబోడలో తాగునీటి సరఫరాను మెరుగుపర్చండి..

బండ్లగూడ,సెప్టెంబర్ 18 : ఎర్రబోడలో తాగునీరు సక్రమంగా రాకపోవడంతో ఇబ్బందులు పడుతున్నామని, వెంటనే సమస్యను పరిష్కరించాలని స్థానికులు రాజు,శ్రీధర్ జలమండలి జనరల్ మేనేజర్ శ్రీలక్ష్మికి బుధవారం వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎర్రబోడలో లోప్రెషర్‌తో వస్తున్న నీరు సరిపోక ట్యాకర్‌లపై ఆధారపడాల్సి వస్తుందన్నారు. నీటిని కొనలేక ఇబ్బందులు పడుతున్నామని, తాగునీటి సరఫరాను మేరుగు పర్చాలని వారు విజ్ఞప్తి చేశారు.

ఆధ్యాత్మిక సాధనకు 'ఫాలూన్ దఫా'

ఖైరతాబాద్, సెప్టెంబర్ 18 : మానవుడి జీవితాన్ని సంస్కరించుకునే ఆధ్యాత్మిక సాధనే 'ఫాలూన్ దఫా' అని సాధన ప్రచార వలంటీర్లు పి. సుబ్రహ్మణ్యం, ప్రేమ్‌నివాస్ తెలిపారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో బుధవారం వారు మీడియా సమావేశంలో వివరాలు వెల్లడించారు. 'ఫాలూన్ దఫా' విద్యను 1991లో లీ హుంగ్ జీ అనే వ్యక్తి చైనాలో విస్తృతపరిచారని, ఏడేండ్లలో చైనాలో ఈ సాధన చేసే వారి సంఖ్య పది శాతానికి పెరిగిందన్నారు.

ఆధాత్మిక సాధన ద్వారా అందరి ఆరోగ్యాలు బాగుపడ్డాయని పేర్కొన్నారు. అయితే తమ మందుల వ్యాపారాలు దెబ్బతింటాయన్న ఉద్దేశంతో ఆ దేశంలో దీనిపై ఆంక్షలు విధించారన్నారు. ప్రపంచ వ్యాప్తంగా 114 దేశాల్లో ఈ సాధన చేస్తున్నారని, సాధనకు సంబంధించిన పుస్తకాన్ని 60 దేశాల్లో ప్రాంతీయ భాషల్లో తర్జూమా చేశారని వారు పేర్కొన్నారు.

వివరాలు వెల్లడిస్తున్న సుబ్రహ్మణ్యం

గర్భిణులు, బాలింతలు పోషకాహారం తీసుకోవాలి

శంషాబాద్ రూరల్, సెప్టెంబర్ 18 : గర్భిణులు, బాలింతలు పోషకాహారం తీసుకోవాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ జ్ఞానేశ్వరి సూచించారు. బుధవారం శంషాబాద్ మండలం మదన్‌పల్లి కొత్తతండా అంగన్‌వాడీ కేంద్రంలో పోషకాహారంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... గర్భిణులు, బాలింతలు ప్రతి రోజూ గుడ్లు, ఆకుకూరలు, క్యారెట్లు, పండ్లు తీసుకోవాలన్నారు. గర్భం దాల్చిన నాటి నుంచి బిడ్డ పుట్టిన ఏడాది వరకు పోషకాహారం తీసుకుంటేనే తల్లీబిడ్డలు ఆరోగ్యంగా ఉంటారని అన్నారు. ఆరు నెలల వరకు తల్లిపాలు మాత్రమే తాగించాలన్నారు. అనంతరం చిన్నారులకు అన్నప్రసాన చేయించారు. కార్యక్రమంలో పాఠశాల చైర్మన్, అంగన్‌వాడీ టీచర్లు అనూరాధ, మమతతోపాటు గర్భిణులు, బాలింతలు పాల్గొన్నారు.

కొత్తతండా అంగన్‌వాడీ కేంద్రంలో పోషకాహార కార్యక్రమంలో పాల్గొన్న మహిళలు

'అధికారులు ప్రహరీ నిర్మాణాన్ని నిలిపివేయాలి'

ఖైరతాబాద్, సెప్టెంబర్ 18 : తమ సొసైటీ స్థలంలో జలమండలి అధికారులు చేపట్టిన ప్రహరీ గోడ నిర్మాణాన్ని నిలిపివేయాలని శ్రీ రాధిక కో ఆపరేటీవ్ హౌజింగ్ సొసైటీ సభ్యుడు రవికాంత్ కోరారు. బుధవారం బంజారాహిల్స్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వివరాలు వెల్లడించారు. బంజారాహిల్స్ రోడ్ నంబర్ 10లోని తట్టి కానా వాటర్ సెక్షన్ పక్కన 1982లో సర్వే నంబర్ 19/90లో పది ఎకరాల పట్టా స్థలాన్ని కొనుగోలు చేసి రిజిస్టర్ చేశామన్నారు. రెండు వారాల క్రితం రెవెన్యూ అధికారులు వచ్చి ఈ స్థలం జలమండలికి కేటాయించినట్లు తమ దృష్టికి వచ్చిందని పేర్కొనడంతో తాము హైకోర్టులో పిటీషన్ దాఖలు చేశామన్నారు. కోర్టులో కేసు నడుస్తుండగా జలమండలి అధికారులు ఇక్కడ ప్రహరీ నిర్మాణానికి ప్రయత్నాలు మొదలుపెట్టారని ఆయన పేర్కొన్నారు. ఇప్పటికే ఈ స్థలాన్ని కొందరు కబ్జా చేయాలని చూస్తున్నారని, పోలీసులు, రెవెన్యూ అధికారులకు సైతం ఫిర్యాదు చేశామన్నారు. ప్రహరీ నిర్మాణం కోర్టు ధిక్కరణ అవుతుందని, తక్షణమే నిలిపివేయాలని కోరారు.

'ఢిల్లీ పీఠాన్ని దక్కించుకునేందుకు బీజేపీ కుట్రలు'

హిమాయత్‌నగర్, సెప్టెంబర్ 18: ఢిల్లీ పీఠాన్ని కైవసం చేసుకునేందుకు బీజేపీ కుట్రలు పన్నుతున్నదని, ఆమ్‌ఆద్మీ పార్టీకి చెందిన ఢిల్లీ సీఎం కేజ్రీవాల్‌ను కేంద్రం రాజకీయంగా ఇబ్బందులకు గురిచేస్తున్నదని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు వీఎస్ బోస్ బుధవారం ఒక ప్రకటనలో విమర్శించారు. కేజ్రీవాల్‌పై ఢిల్లీ ప్రజలకున్న అభిమానంతో బీజేపీ కుట్రలు ఎంతమాత్రం ప్రభావం చూపడం లేదన్నారు. ఈడీ,సీబీఐ లాంటి సంస్థలను ప్రయోగించి అక్రమంగా కేసులు నమోదు చేయించి కేజ్రీవాల్‌ను ఇబ్బందులు పెట్టాలని కుటీల ప్రయత్నాలను కేంద్రం చేస్తుందన్నారు. మద్యం ఆరోపణల కేసులో జైలుకు వెళ్లిన కేజ్రీవాల్ బెయిల్‌పై బయటకు వచ్చి ప్రజల ఆమోదంతోనే తిరిగి తాను సీఎం పదవి చేపడతానని ప్రకటించి నిజాయితీని చాటుకున్నాడని పేర్కొన్నారు. బీజేపీ నీచ రాజకీయాలను వీడాలని ఆయన హితవు పలికారు.

కూలికి వెళ్తున్నానని చెప్పి యువకుడు అదృశ్యం

శంషాబాద్ రూరల్, సెప్టెంబర్ 18: కూలికి వెళ్తున్నానని చెప్పి బయటికి వెళ్లిన యువకుడు అదృశ్యమైన సంఘటన బుధవారం శంషాబాద్ రూరల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. సీఐ నరేందర్‌రెడ్డి కథనం ప్రకారం.. శంషాబాద్ మండలం నర్కూడ గ్రామానికి చెందిన బత్తుల ఆనంద్ (25) రెండు నెలల క్రితం హర్షిత అనే యువతిని ప్రేమ వివాహం చేసుకున్నాడు. ఈనెల 16న మధ్యాహ్నం సమయంలో కూలికి వెళ్తున్నట్లు ఇంట్లో చెప్పి వెళ్లిన వ్యక్తి సాయంత్రం వరకు ఇంటికి రాలేదు. ఇదిలా ఉంటే 17 తేది రాత్రి ఆనంద్ తన భార్య హర్షితకు ఫోన్ చేసి తాను బెంగుళూరు వెళ్తున్నానని, నువ్వు మీ అమ్మవాళ్ల ఇంటికి వెళ్ళు అంటూ ఫోన్ కట్ చేశాడు. ఈ విషయమై హర్షిత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

నాణ్యత పాటించని హోటల్ యజమానికి రూ. 10వేల జరిమానా

బండ్లగూడ,సెప్టెంబర్ 18 : బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో నాణ్యత ప్రమాణాలు పాటించని హోటల్‌పై కార్పొరేషన్ అధికారులు దాడులు నిర్వహించి రూ. 10 వేల జరిమానా విధించారు. హైదర్‌షాకోట్‌లోని శ్రీరమణ ఫుడ్ కోర్టును అధికారులు తనిఖీ చేసి నాణ్యత పాటించడం లేదని గుర్తించారు. ఈ సందర్భంగా కమిషనర్ శరత్‌చంద్ర మాట్లాడుతూ హోటల్ యజమానులు నాణ్యత ప్రమాణాలు పాటించకపోతే హోటళ్లను సీజ్ చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ నరేశ్, సిబ్బంది పాల్గొన్నారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతి

ఖైరతాబాద్, సెప్టెంబర్ 18 : ఖైరతాబాద్ పోలీసు స్టేషన్ పరిధిలో గుర్తు తెలియని వ్యక్తి ఫుట్‌పాత్‌పై మృతిచెందాడు. ఏఎస్ఐ శ్రీరాములు తెలిపిన వివరాల ప్రకారం.. షాదన్ కళాశాల వద్ద ఫుట్‌పాత్‌పై గుర్తుతెలియని వ్యక్తి విగతజీవిగా పడి ఉన్నాడు. స్థానికుల సమాచారం మేరకు అక్కడకు చేరుకుని పరిశీలించిన పోలీసులు ఆ వ్యక్తి మృతిచెందినట్లు నిర్ధారించారు. గత 15 రోజులుగా ఫుట్‌పాత్‌పైనే ఉంటూ యాచిస్తున్నట్లు తెలిపారు. మృతదేహాన్ని ఉస్మానియా దవాఖాన మార్చురీకి తరలించామన్నారు.

అర్ధరాత్రి వరకు నిమజ్జన ఊరేగింపులు

- వినాయక లడ్డూలకు క్రేజ్

మైలార్‌దేవ్‌పల్లి, సెప్టెంబర్ 18: వినాయక నిమజ్జన ఊరేగింపులు బుధవారం అర్ధరాత్రి వరకు కొనసాగాయి. నవరాత్రులు భక్తిశ్రద్ధలతో పూజలందుకున్న గణనాథుడి లడ్డూలకు వేలం నిర్వహించారు. లడ్డూలను కొనుగోలు చేసేందుకు భక్తులు పెద్ద ఎత్తున పోటీపడ్డారు. అత్తాపూర్‌లోని న్యూ స్టార్స్ భక్త సమాజం ప్రతిష్ఠించిన గణనాథుడి లడ్డూను రూ. 11.16 లక్షలకు ఏనుగుల సుభాష్‌రెడ్డి దక్కించుకున్నారు. ఈ సందర్భంగా నిర్వాహకులు ఆయన్ను ఘనంగా సన్మానించారు. అదేవిధంగా హైదర్‌గూడలోని గణనాథుడి లడ్డూను రూ.85 వేలకు చంటి కైవసం చేసుకున్నాడు. బ్యాండ్ చప్పుళ్లు, డీజే మోతల నడుమ చిన్నారులు, యువతీయువకుల నృత్యాలతో వినాయకులను నిమజ్జనాలకు తరలించారు.

అధికారులకు, భక్తులకు కృతజ్ఞతలు

గణేశ్ నవరాత్రి ఉత్సవాలకు సహకరించిన అధికారులు, మండపాల నిర్వాహకులు, భక్తులకు గణేశ్ ఉత్సవ సమితి ఉపాధ్యక్షుడు నారగూడెం మల్లారెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. అత్తాపూర్ డివిజన్ హైదర్‌గూడలోని తన కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. రాజేంద్రనగర్ పత్తికుంట చెరువు, మైలార్‌దేవ్‌పల్లిలోని పల్లెచెరువుల వద్ద నిమజ్జనోత్సవాలు ప్రశాంతంగా జరిగాయన్నారు.

అమీర్‌పేట్ గణేశ్ లడ్డూను 6.11లక్షలకు దక్కించుకున్న సంజనాగైక్వాడ్

వెంగళరావునగర్ : అమీర్‌పేట్‌లోని ఐకానిక్ ఫార్మ్స్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన గణేశ్ మండపంలో నిర్వహించిన వేలంలో సంజనా గైక్వాడ్ రూ.6,11,100లకు లడ్డూను సొంతం చేసుకున్నారు. సంజనా గైక్వాడ్‌ను ఆలేరు ఐకానిక్ ఫార్మ్స్ మేనేజింగ్ డైరెక్టర్స్ శ్రీనివాస్‌గౌడ్, సుధీర్‌కుమార్, మార్కెటింగ్ సిబ్బంది, కస్టమర్లు, నిర్వాహకులు ఘనంగా సన్మానించారు.

సుల్తాన్‌పల్లిలో..

శంషాబాద్ రూరల్ : మండలంలోని సుల్తాన్‌పల్లి గ్రామంలో ప్రగతి యూత్ అసోషియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయకుడి లడ్డూకు బుధవారం వేలం నిర్వహించారు. వేలంలో కుమ్మరి కృష్ణ లక్షా 40 వేల రూపాయలకు లడ్డూను కైవసం చేస్తుకున్నట్లు నిర్వాహకులు తెలిపారు. అదేవిధంగా శంషాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని ఊటుపల్లి గ్రామంలో నిర్వహించిన వినాయక లడ్డూను వేలంలో కౌన్సిలర్ కొండ ప్రవీణ్‌గౌడ్ కైవసం చేసుకున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

అత్తాపూర్‌లోని న్యూ స్టార్స్ భక్త సమాజం ఏర్పాటు చేసిన గణనాథుడి లడ్డూను రూ. 11.16 లక్షలకు దక్కించుకున్న ఏనుగుల సుభాష్‌రెడ్డి, తదితరులు

ఏపీ సీఎం సహాయనిధికి రూ.2.35లక్షల విరాళం

హిమాయత్‌నగర్, సెప్టెంబర్ 18: ఆంధ్రప్రదేశ్ వరద బాధితుల సహాయార్థం హైకోర్టు సీనియర్ న్యాయవాది ముత్తినేని కోటేశ్వర్‌రావు, సునీత దంపతులు బుధవారం సీఎం సహాయ నిధికి రూ.2,35,000 విరాళం అందజేశారు. చెక్కును ఏపీలోని ఉండవల్లిలో మంత్రి నారా లోకేశ్‌కు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వరద బాధితులను ఆదుకునేందుకు దాతలు, సంస్థలు విరాళాలు అందజేయాలని కోరారు.

వినాయకుడి పూజలో బీఆర్ఎస్ నాయకులు

శంషాబాద్ రూరల్: నర్కూడలో శ్రీచైతన్య యూత్‌క్లబ్ మండపం వద్ద వినాయకుడి పూజలో పాల్గొన్న డీసీసీబీ డైరెక్టర్ బుర్కుంట సతీశ్, బీఆర్ఎస్ నాయకులు చదన్‌వెల్లి శ్రీనివాస్, వెంకటయ్య, సిద్ధులు, ఈశ్వర్, గణేశ్, అశోక్, తదితరులు

గుర్తు తెలియని యువతి మృతదేహం లభ్యం

మణికొండ, సెప్టెంబర్ 18: నార్సింగి పోలీస్‌స్టేషన్ పరిధిలో గుర్తు తెలియని యువతి మృతదేహం లభ్యమైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నార్సింగి నెమలి ఫామ్‌హౌస్ సమీపంలోని గండిపేట చెరువు లో గుర్తుతెలియని మృతదేహం ఉన్న ట్లు స్థానికులు సమాచారం అందించారు. వెంటనే పోలీసులు సంఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించగా 25-30 సంవత్సరాల యువతి మెరూన్ కలర్ టాప్, క్రీంకలర్ లెగ్గిన్ ధరించి మెడలో తాయత్తు ఉందని, తాయత్తుపై ముస్లింలకు సంబంధించిన గుర్తు ఉందన్నా రు. మృతదేహం గుర్తు పట్టలేనంతగా మారిపోయిందన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు. ఆచూకీ తెలిసిన వారు 87125683 41, 9490617189 నంబర్లలో సంప్రదించాలని పోలీసులు కోరారు.

దివ్యాంగుల సంక్షేమం కోసం ప్రత్యేక పాలసీ తేవాలి

చిక్కడపల్లి, సెప్టెంబర్ 18 : దివ్యాంగుల సంక్షేమం,అభివృద్ధి కోసం కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక పాలసీ ప్రకటించాలని ఎన్ఫీఆర్‌డీ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు కె.వెంకట్, అడివయ్య డిమాండ్ చేశారు. చిక్కడపల్లిలోని దివ్యాంగుల వేదిక రాష్ట్ర కార్యాలయంలో జరిగిన సమావేశంలో వారు మాట్లాడారు.

నంద్యాల నుంచి హైదరాబాద్ వరకు..

- జైల్లో పరిచయమైన దొంగలతో కలిసి ఇండ్లల్లో చోరీలు
- నిందితుల అరెస్ట్
- 600 గ్రాముల బంగారు ఆభరణాలు స్వాధీనం

బండ్లగూడ,సెప్టెంబర్ 18 : నంద్యాల నుంచి హైదరాబాద్‌కు వరకు తాళం వేసి ఉన్న ఇండ్లను టార్గెట్‌గా చేసుకుని దొంగతనాలకు పాల్పడుతున్న ముఠాను రాజేంద్రనగర్ పోలీసులు బుధవారం అరెస్ట్ చేశారు. వారి వద్ద రూ. 35ల